: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 17 | 23-01-2023 | పుటలు : 4

# క్రీడల్లో నన్నయ సత్తా

ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ తరుపున 2022 - 23 విద్యా సంవత్సరంలో 65 క్రీడాంశాలలో అంతర్ కళాశాల పోటీలను నిర్వహించి యూనివర్సిటీ తరుపున టీమ్స్ ను సెలక్ట్ చేసి నేషనల్ యూనివర్సిటీ పోటీలకు పంపిస్తున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆయా ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని సత్తాచాటుతున్నారు. ఈ సందర్భంలో జనవరి నెలలో నిర్వహించిన క్రీడాపోటీల వివరాలను చూద్దాం.

## చెస్ (మెన్)



ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో జనవరి 6న జరిగింది. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురుని ఎంపిక చేసి చెన్నై లోని ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## పవర్ లిఫ్టింగ్



పి.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాకినాడలో జనవరి 21న జరిగింది. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పది మందిని ఎంపిక చేసి మెన్ పోటీలు గురుకాశీ యూనివర్సిటీ బటెండాలో మార్చి 2-5, ఉమెన్ పోటీలు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హిమాచలప్రదేశ్ మార్చి 9-12లో జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## క్రాస్ కంట్రీ



ఎస్.ఎస్.ఆర్. ప్రభుత్వ వ్యాయామ కళాశాల గోపన్నపాలెంలో జనవరి 21న జరిగింది. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మందిని ఎంపిక చేసి బెంగళూర్ లోని ప్రెసిడెంట్సీ యూనివర్సిటీలో ఫిబ్రవరి 12 జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## రోప్ స్కిప్పింగ్



ఎస్.వి.డి. మహిళా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నిడదవోలులో జనవరి 9వ తేదీన రోప్ స్కిప్పింగ్ జరిగింది. 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో 10 మందిని ఎంపిక చేసి ఎల్.ఎం.సి.టి. బోపాల్ లోని జనవరి 20-24 జరుగుతున్న నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## విద్యార్థులకు శుభాభినందనలు!!

ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభను కనపరచిన విద్యార్థులు విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక కావడం హర్షనీయం. నన్నయ విశ్వవిద్యాలయం తరుపున వివిధ క్రీడల్లో జాతీయస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచాలని హృదయపూర్వక శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఇదే స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులందరూ విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ శరీర, మానసిక వికాసాన్ని పొందుతారని భావిస్తున్నాను.

ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు
ఉపకులపతి(ఎఫ్.ఎ.సి) ఆదికవి నన్నయ యూనివర్సిటీ



## క్రికెట్ (ఉమెన్)



ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో జనవరి 20న జరిగింది. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 16 మందిని ఎంపిక చేసి జె.ఎస్.ఎస్. యూనివర్సిటీ మైసూర్ లో జనవరి 30 నుండి ఫిబ్రవరి 5 వరకు జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## హ్యాండ్ బాల్(మెన్)



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలో జనవరి 10,11 తేదీలలో హెండ్ బాల్ పోటీలు జరిగాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల నుండి 8 టీమ్స్ దీనిలో పాల్గొన్నాయి. వీరిలో 16 మందిని యూనివర్సిటీ టీమ్ గా ఎంపిక చేసి పెరియార్ యూనివర్సిటీ సేలం(తమిళనాడు) ఫిబ్రవరి 4-8 వరకు జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## గోదావరి క్రీడాప్రతిభకు నన్నయ వేదిక



ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదికగా నిలుస్తుంది. ప్రతీ ఏడాది ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఎందరో క్రీడాకారులు వివిధ రకాల జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు, కళాశాలల యాజమాన్యాలకు అభినందనలు. ప్రస్తుతం 2022-23 నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు.

- డా.బి.రామగోపాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ

## బెస్ట్ ఫిజిక్



పి.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాకినాడలో జనవరి 20న జరిగింది. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పది మందిని ఎంపిక చేసి మెంగళూర్ లోని యనుపోయా యూనివర్సిటీలో జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## వెయిట్ లిఫ్టింగ్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో జనవరి 11న జరిగింది. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎనిమిది మంది అమ్మాయిలు, పది మంది అబ్బాలను ఎంపిక చేసి యూనివర్సిటీ ఆఫ్ కేలికట్ కేరళలో జనవరి 27-29 వరకు జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## సపక్ తక్రా



ఎస్.కె.బి.ఆర్. కళాశాల అమలాపురంలో జనవరి 16న జరిగింది. 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 14 మందిని ఎంపిక చేసి మణిపూర్ యూనివర్సిటీలో జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## నెట్ బాల్



ఎస్.వి.కె.పి. డా.కె.ఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ పెనుగొండ జనవరి 18,19న జరిగింది. 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హరియానాలో ఫిబ్రవరి 15-18 జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## బాల్ బెట్మెంటన్ (ఉమెన్)



డి.ఆర్.గోయంక ప్రభుత్వ కళాశాల తాడేపల్లిగూడెంలో జనవరి 20న జరిగింది. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పది మందిని ఎంపిక చేసి చెన్నై లోని బి.ఎస్.అబ్దుర్ రెహమాన్ క్రెసంట్ యూనివర్సిటీలో జనవరి 27-30 జరిగే నేషనల్ యూనివర్సిటీ గేమ్స్ కు హాజరవుతారు.

## సంపాదకీయం



# వినుర వేమన!

" సాధనమున పనులు సమకూరు ధరలోన "

ఇలా పద్యంలో మూడో పాదం గొప్ప సూక్తి. ఆ సూక్తిని మన మదిలో నిలవటానికి పైన రెండు పాదాలు ఒక ఉదాహరణ. నాలుగో పాదం మకుటం ' విశ్వదాభిరామ వినురవేమ '

వేమన పద్యం, సూక్తి తెలియని తెలుగు వారుండరు. చదువులు సరిగ్గా సాగని సాధారణ ప్రజల నాలుకల మీద కూడా వేమన పద్యం,సూక్తి నర్తిస్తూనే ఉంటుంది. అందుకనే వేమన

ప్రజాకవి.ఆ ప్రజాకవి జనులకు జ్ఞాన మార్గాన్ని బోధించాడు. అవన్నీ నీతి పద్యాలుగా ప్రాచుర్యాన్ని పొందాయి. తెలుగు వాచకాల్లో,శతకాలుగా ప్రచురించిన పుస్తకాల్లో వివాద రహితమైన సామాన్య నీతుల్నే చేర్చారు కాబట్టి వాటికే ఎక్కువ ప్రాచుర్యం కలిగింది. సంఘ జీవనానికి చీడపురుగుల్లా దాపురించిన అవినీతిని, దురాచారాలను ఖండించిన పద్యాలు కూడా చాలా ఉన్నాయి. అసలు సిసలైన తత్త్వమే వేమన గమ్యం. చీకట్లో కొట్టుమిట్టాడే సామాన్య జనుల్ని కాంతితీరం వైపునకు దారి చూపించాడు.

సాంఘిక దోషాలను సరిదిద్దటానికి మానవత్వ సిద్ధాంతంతో పోరాడటం వేమన పద్యాల్లో కనిపిస్తుంది. బహుశా ఆ సాహసమే వేమన పద్యాలలోని సౌందర్యానికి కారణం కూడా. సాంఘిక దురాచారాల నుంచి, అధర్మాల నుంచి మనిషిని రక్షించటమే వేమన ఉద్దేశం.

మానవత్వమే వేమన మతం. మానవత్వం ఒక మతం కాదు. ఒక విశాల దృక్పథం. అది విశ్వజనీనమైన అంశం. మనిషి జీవితానికి సంబంధించిన ప్రాథమికమైన విలువలపైనే దాని ఋజుదృష్టి కేంద్రీకరించి ఉంటుంది. గంభీరమైన తాత్త్విక చర్యలకన్నా సమాజ జీవనంపైన వాటి ప్రభావమే వేమనకు ముఖ్యం. వేమన జీవితాన్ని సంపూర్ణంగా దర్శించినవాడు.

జీవితంలోని కీలక సంఘటనలు, ఉద్రేకపూరితమైన అనుభవాలు, తీరని కోరికలు... ఇవన్నీ మనిషిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.వేమనది సహజమైన ఉద్రేక ప్రకృతి. దాని వలనే ఆయన పలుకులకు జవజీవాలు కలిగాయి. నిజాయితీగల జీవితం నుంచే సత్యం పుడుతుంది. సత్యమే మానవత. ఈ రెండింటి సమ్మేళనమే వేమన పద్యాలలోని అంతస్సారం.

నిర్జీవమైన కొన్నిటికి వీడ్కోలు చెబుతూ కొత్త పరిణామాలకు స్వాగతం పలికాడు వేమన.మూఢ విశ్వాసాల మీద సమరం ప్రకటించాడు.మానవత్వంతో విరుచుకుపడ్డాడు.ఆ సమరానికి లక్షణం సమాజ ప్రగతి.

రాతి బాటల్లో జాతిరత్నాలు వెదజల్లిన కవి వేమన.ఆయన పేరు మీదుగా 'యోగి వేమన విశ్వవిద్యాలయం' కడప జిల్లాలో నెలకొల్పటం ఆయన పట్ల మనకున్న కృతజ్ఞత!

వేమన అనే కవి ఒకరు జీవించారని, ఆయన పద్యాలు ఇవేనని మన చేతుల్లో పెట్టిన గొప్ప పరిశోధకుడు సి.పి. బ్రౌన్ మహాశయుని ఒకసారి గుర్తు చేసుకోవడం కూడా మన బాధ్యత!!

పిల్లలకి ఓ పది వేమన పద్యాలనైనా మనం నేర్పాలి.అందులోని సూక్తులు వారి జీవితాలకి ఏదో సమయంలో ఉపయోగపడతాయి.

*గంగిగోవు పాలు గరిటడైననుచాలు!*

# వేమన సాహిత్యంతో సమాజ చైతన్యం

## వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**19.01.23 (మీడియాసెల్)** సామాన్యులకు సైతం అర్ధమయ్యే భాషలో సాహిత్యాన్ని అందించి సమాజాన్ని చైతన్య పరిచిన ప్రజాకవి వేమన అని వీసీ ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి వీసీ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పామరులకు కూడా అర్ధమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించిన కవి, మట్టిలో పుట్టి మహోన్నతమైన శిఖరాలను అందుకున్న మానవతామూర్తి యోగి వేమన అని అన్నారు. వేమన తన సాహిత్యంతో సమాజాన్ని ఆలోచింపచేసారని చైతన్యపరిచారని అన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువారు ఉండరన్నారు. సమాజంలోని రుగ్మతలను, మూఢత్వాలను తన సాహిత్యంతో శుద్ధిచేసిన ప్రజాకవి వేమన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డా.ఎ.మట్టారెడ్డి, ఎస్.లింగారెడ్డి, డా.ఎం.గోపాలకృష్ణ, డా.కె.వి.ఎన.డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

# నన్నయ మహిళ క్రికెట్ టీమ్ సెలక్షన్స్



నన్నయ వర్సిటీ ఉమెన్ క్రికెట్ జట్టు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో మహిళా క్రికెట్ టీమ్ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఈ సెలక్షన్స్ కు మెంబర్స్ గా డా.జె.సునీల్(నరసాపురం), ఎన్.విజయసారిధి(పెనుగొండ) హాజరై ప్రతిభవంతులైన 16 మంది క్రీడాకారులను యూనివర్సిటీ టీమ్ గా ఎంపిక చేసారు. వీరు జనవరి 28 నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ మైసూరు పట్టణంలో నిర్వహించు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు హాజరవుతారు. టీమ్ మేనేజర్ గా యూనివర్సిటీ క్రికెట్ కోచ్ వి.సొలోమాన్ దేవానంద్ హాజరవుతారు. స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డా.కె.సుబ్బారావు, సెక్రటరీ డా.బి.రామగోపాల్ క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి ఉమెన్ క్రికెట్ పోటీలలో నన్నయ విశ్వవిద్యాలయ జట్టు సత్తాచాటాలని ఆకాంక్షించారు.




## మంచిమాట

తప్పు లెన్నువారు తండోప తండంబు
ఉర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పు లెన్నువారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ వినుర వేమ!

# ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు

- రికార్డు స్థాయిలో హాజరైన అభ్యర్థులు
- రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.టేకి

**22.01.23 (మీడియాసెల్)** పోలీస్ రిక్రూట్మెంట్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.టేకి తెలిపారు. ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష కేంద్రాలను రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్ టేకి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ పరీక్షలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని అన్నారు. రికార్డు స్థాయిలో 91% అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. రాజమహేంద్రవరం పరిధిలోని విశ్వవిద్యాలయ ప్రాంగణం తో పాటు 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించామన్నారు. 12424 మంది పరీక్షలు వ్రాయాల్సి ఉండగా 11340 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పరీక్షలకు హాజరైన వారి శాతం 91.2 గా ఉందని, ఇటీవల కాలంలో జరిగిన పరీక్షలతో పోలిస్తే రికార్డు స్థాయిలో హాజరు నమోదయిందని తెలియజేశారు. అభ్యర్థులందరూ నియమ నిబంధనలను, క్రమ శిక్షణ పాటిస్తూ పరీక్షలు వ్రాసారన్నారు. చక్కని భద్రత ఏర్పాట్లతో పగడ్బందీ చర్యలు చేపట్టి సహకరించిన పోలీసులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


కానిస్టేబుల్ పరీక్షలను పరిశీలిస్తున్న దృశ్యం






# రావూరి భరద్వాజ

## (5.7.1927 - 18.10.2013)

## జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

*అవిభక్త హైదరాబాద్ సంస్థానానికి చెందిన పరిటాల జాగీర్ లోని మొగులూరు గ్రామంలో జన్మించారు భరద్వాజ. తండ్రి కోటయ్య, తల్లి మల్లికాంబ. పెరిగింది గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలో. పొట్టకూటికోసం వ్యవసాయ కూలీగా, పశువుల కాపరిగా, రంపములాగే పనివానిగా ,తిత్తులు ఉదే కూలీగా, పేపర్ బాయ్ గా పని చేశారు.*

*17వ ఏట నుండి రచన చేయడం ప్రారంభించారు. తొలి కథ విమల. తొలి పుస్తకం రాగిణి. ఆయన రాసిన దైవరాజకీయాలు కథ స్వర్ణ కంకణం పొందింది. 43 కథలు, 17 నవలలు, 11 సాహిత్య గ్రంథాలు, 33 సైన్స్ కథలు రాశారు.*

*1968లో 1983లో రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1987లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు ఇలా చాలా పురస్కారాలు అందుకున్నారు. వీరి రచనల్లో అనేకం ఇంగ్లీష్, హిందీ, తమిళం, కన్నడం,మలయాళం భాషల్లోకి అనువాదమయ్యాయి. మూడు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టర్ ఇచ్చి సత్కరించాయి. వీరి రచనల మీద నాలుగు విశ్వవిద్యాలయాల్లో పీహెచ్డీ పరిశోధనలు జరిగాయి. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో తెలుగు ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ భరద్వాజ గారు చదువుకున్నది ఏడవ తరగతి వరకు మాత్రమే.*

*భరద్వాజ రచన 1965 సంవత్సరంలో కృష్ణ పత్రికలో సీరియల్ గా వెలువడిన" పాకుడు రాళ్లు "నవలకు 2012 సంవత్సరానికి" జ్ఞానపీఠ " పురస్కారం లభించింది.*

*ఆయన రచించిన జీవన సమరం పుస్తకం సామాజిక జీవనానికి ప్రతిబింబం. అందులోని వ్యక్తులు మనకు బాగా తెలిసినవారు. మనతోపాటు మన మధ్యన జీవిస్తున్నవారు. వారిని గురించి మనం ఆలోచించలేకపోవచ్చు. వారిని చూసి మనం స్పందించకుండా ఉండొచ్చు. ఈ*

## ప్రతిభా వాణి

*అధో జగత్ సహోదరుల బతుకుల్లోకి తొంగి చూడాలంటేనే చాలామందికి భయం. శ్రీ భరద్వాజ ఇతరులు చేయలేని పనులన్నీ చేశారు. వారి బతుకుల్లోకి తొంగి చూసి స్పందించి పాఠకుల్ని స్పందింప చేశారు. వ్యధార్త జీవుల యదార్థ గాథలను జీవన సమరం గ్రంథంగా తీసుకొచ్చారు. భరద్వాజ జీవితం వడ్డించిన విస్తరి కాదు. బతుకులోని కష్టాలను కన్నీటిని అన్ని చూసినవారు. చారెడు గంజి కోసం బారెడు గుడ్డ కోసం కలవరించిన వ్యక్తి. ఆకలి, అభిమానం, నిరుద్యోగం, నిరాదరణ అనుభవించిన వ్యక్తి. జీవన పథంలో కాలూని నిలవడం కోసం రకరకాల వృత్తులని చేశారు. ఆ వృత్తుల్లోని సాధక బాధకాలను కష్టనష్టాలను పదిలంగా గుండె లోతుల్లో దాచుకుని వాటిని ఒడిసి పిండి పీల్చుకొని తన రచనల ద్వారా మహా రచయితగా ఎదిగారు. విస్తృతమైన ఆయన జీవితాన్ని అనుభవాలన్నీ ఆయన రచనల్లో మనకు దర్శనమిస్తూ ఉంటాయి. తెలుగులో అటువంటి మహా రచయితకు నన్నయవాణి ఘన నివాళినర్పిస్తుంది.*

# కోయభాష - సంస్కృతి

నేడు ప్రపంచీకరణ యుగంలో కొన్ని ఆదివాసీల అస్థిత్వం అంతరించే స్థాయికి చేరింది. అందులో ఒక కోయతెగవారి భాష కోయభాష, వారిని కోయత్తోర్ అని అంటారు. వారి భాషకు లిపిలేదు. వారు చిన్ననాటి నుండి ఆ మాటలు వినడం వల్ల ఆ తెగ ప్రజలకు లిపిల లేకుండానే భాష వస్తుంది. ఇది ఇలా కొనసాగితే వారి అస్థిత్వం, ఉనికి, జీవన స్థితిగతులు ప్రమాదంలో ఉన్నాయి.



చరిత్ర

కోయతెగ ఆదివాసీలు అంటే తెలంగాణాలో అత్యంత వైభవంగా జరిగే మేడారం 'సమ్మక్క సారక్క జాతర' గుర్తుకు వస్తుంది. చరిత్రకారులు కొందరు ఈ జాతిని నిర్ధష్టమైన తెగ అని తమ రచనలలో పేరొన్నారు. ఈ కోయ జాతి మూలాలు క్రీ.పూ. 2500 సం? నుండి 1000 మధ్య శిలాయుగంలో ఉన్నట్లు శిలాయుగ అవశేషాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా ప్రాంతంలో 2007-08లలో లభించాయి. కోయ భాష తెగ ఎక్కువగా ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గడ్, ఒడిస్సా, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఎక్కువగా మాట్లాడతారు. తెలుగు రాష్ట్రాలలో 30 ఆదివాసి తెగలు ఉంటే వాటిలో 8 తెగలకు ప్రత్యేక భాష ఉంది. వాటిలో కోయభాష చాలా పెద్దది. ఆదివాసీ భాషకు మూలం కోయత్తోర్.



సంస్కృతి సంప్రదాయాలు

కోయజాతికి అనేక రకాల్కైన సంస్కృతి సంప్రదాయాలు, పద్ధతులు ఉన్నాయి. భూమి పండుగ, పూర్వీకులు భద్రపరిచిన వస్త్రాలపై చిత్రాలతో, పేన్ పండగ, కొల్పు, ఇల్‌కట్ (సుంకు) పండుగ, పచ్చపండుగ, పచ్చకర్ర కడిగే పండుగ, చిక్కుడు పండుగ వీటితోపాటుగా గ్రామ దేవతలు, తెలుగు పండుగలు కూడా పెద్దఎత్తున జరుపుకుంటారు.

ఆహారపు అలవాట్లు

ఈ కోయతెగ ముఖ్యంగా 'వేట' ప్రధాన ఆహార సేకరణలో భాగంగా ఉంటుంది. ముఖ్యంగా అడవులలో జంతువులను వేటాడి వాటిని ఎక్కువ రోజులు ఉండేటట్లు ఎండబెడతారు. వాగులలో కొండ కాలువలలో చేపలు పట్టి వాటిని కాల్చి ఎండబెడతారు. అలాగే అడవులలో శీతోష్ణస్థితులకు అనుగుణంగా లభించే ఆకుకూరలు, దుంపలను తెచ్చి వండుకుంటారు. జొన్న, వరి, కందులు, నువ్వులు, ఇప్ప, మినుములు, బొబ్బర్లు, మొక్కజొన్నలు, చిక్కుడు వంటి పంటలను పండిస్తారు.

జీవనశ్కైలి/ పద్ధతులు

ఈ కోయ తెగజాతికి కొన్ని ఇంటి పేర్లు ఉంటాయి. వారు ఆ ఇంటిపేరుతో ఒక కుటుంబంగా ఉంటారు. కుటుంబ పెద్ద తండ్రి. తండ్రి తరువాత కుటుంబంలో పెద్ద కుమారుడు కుటుంబ పెద్ద అవుతాడు. తండ్రిని కుటుంబం అంతా గౌరవిస్తారు. ఈ కుటుంబ వివాహ వ్యవస్థలో వేరే ఇంటిపేరు వరసకు అయిన పిల్లలను పెద్దల సమక్షంలో కల్లు కలుపుకొని ఊరి అందరి సమక్షంలో బందువుల సమక్షంలో పెళ్ళి జరుపుతారు.

ఈ తెగలో పెళ్ళి తతంగం 3 రోజులు ఉంటుంది. మొదటి రోజు పెళ్ళి కూతురి దగ్గర చీరతోపాటు కల్లు కలుపుకుంటారు. మరల పెళ్ళికొడుకు దగ్గర 2 రోజులు ఉంటుంది. మొదటిరోజు (పెళ్ళికూతుర్ని దగ్గర చీర, జాకెట్టుతోపాటు కల్లు కలుపుతారు) పెళ్ళికూతురిని పెళ్ళిపందిట్లో ఆటపాటలతో పందిట్లోకి తీసుకొనివచ్చి అందరి సమక్షంలో పెద్దమనుషులు పూజారి కుటుంబంతో పెళ్ళికొడుకుతో తాళి కట్టిస్తారు. రెండవరోజు ఊళ్ళో వారు అందరికి విందు ఏర్పాటు చేస్తారు. తరువాత సాంప్రదాయ జానపద పద్ధతుల ద్వారా పెళ్ళికూతురిని అత్తవారింటికి ఆహ్వానిస్తారు.

ఈ తెగవారు మరణించిన తరువాత, ఆట పాట డాన్సులతో సాగనంపుతారు. పెద్ద ఖర్మ డోలి, పూజారి, పెద్ద మనుషులతో కుటుంబ సభ్యులతో అంతిమ కర్మలు నిర్వహిస్తారు. ఈ జాతిలో మనిషి పుట్టినప్పటి నుండి మరణించే వరకు ఆనందంగానే ఉంటాయి. (మరణానంతరం కుటుంబ సభ్యులు ఆనందంగా ఉంటారు).

కోయజాతి ప్రపంచీకరణ నేపథ్యంలో, వారి భాష, సంస్కృతి అంతరిస్తుంది. గిరిజనేతరులు గిరిజనులను దోపిడి చేస్తున్నారు. బహుళజాతి కంపెనీలు అడవులలోకి వచ్చేస్తున్నాయి. కొండలు కరిగిపోతున్నాయి గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్నాయి. అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసీలను అడవులకు దూరం చేస్తున్నారు. గిరిజన సంఘాలు ఉన్నప్పటికి ప్రభుత్వ ప్రోద్భలంతో అధికారంలో ఉన్నవారు, అధికారులు గిరిజన అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారు. గిరిజనులు కూడా ఆకర్షణలకు లోన్కె సంస్కృతి, సాంప్రదాయాలకు దూరమవుతున్నారు. ఈ సమయంలో గిరిజన భాష, సంస్కృతిని కాపాడుకుంటూ అభివృద్ధిని సాధించవలసిన అవసరం ఎంత్కెనా ఉంది. కోయభాష లిపిని తయారుచేసి భద్రపరచడానికి ఈ భాష మాట్లాడేవారు ఒక వేదికపైకి రావాలి.





**- రవ్వ పవన్‌కళ్యాణ్**
**ఎమ్.ఏ., రాజనీతిశాస్త్రం (ద్వితీయ సంవత్సరం)**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**